Friday, July 24, 2015

# రూ.20 కోట్లతో టిసిఎస్ పరిశోధనా కేంద్రం




**కోహ్లి సెంటర్ ఆఫ్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ ఏర్పాటుకు ట్రిపుల్ ఐటితో ఒప్పందం**

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) :** సాఫ్ట్‌వేర్ దిగ్గజం టిసిఎస్ హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటి ప్రాంగణంలో సాఫ్ట్‌వేర్ పితామహుడు ఎఫ్‌సి కోహ్లి పేరు మీద కోహ్లి సెంటర్ ఆఫ్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ (కెసిఐఎస్) ఏర్పాటు చేస్తోంది. టాటా గ్రూప్ చైర్మన్ సైరస్ మిస్త్రీ, టిసిఎస్ సిఇఒ చంద్రశేఖరన్, తెలంగాణ ఐటి మంత్రి కెటి రామారావు గురువారం దీనికి శంకుస్థాపన చేశారు. 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 20 కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ సెంటర్‌కు సంబంధించిన ఒప్పందంపై చంద్రశేఖరన్, ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పిజె నారాయణన్ సంతకాలు చేశారు. ప్రపంచానికి కంప్యూటర్లంటే ఏమిటో తెలియని రోజుల్లోనే టాటా ఎలక్ట్రికల్స్‌లో పని చేస్తున్న కోహ్లి కంప్యూటర్లు ఏర్పాటు చేసి టిసిఎస్ స్థాపనలో కీలక పాత్ర పోషించారని, ఆయన పేరు మీద ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రం ఇంటెలిజెంట్ సిస్టమ్స్ రోబోటిక్స్, మెషీన్ లెర్నింగ్, నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ విభాగాల్లో కొత్త అధ్యయనాలకు తెర తీస్తుందని మిస్త్రీ అన్నారు. భవిష్యత్‌లో విస్తృత పరిశోధనలకు అవకాశం ఉన్న రంగాల్లో సామాన్య ప్రజలకు ఉపయోగపడే టెక్నాలజీలపై పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తామని చంద్రశేఖరన్ తెలిపారు. రానున్న కాలంలో ఇంటెలిజెంట్ సిస్టమ్స్, నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్,

రోబోటిక్స్ విభాగాల్లోనే ఆటోమేషన్ అధికంగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ విభాగాల్లోని స్టార్టప్ కంపెనీలకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ట్రిపుల్ ఐటి ఏర్పాటయిన నాటి నుంచి సామాన్య ప్రజలకు అవసరం అయిన పరిశోధనల నిర్వహణకే అగ్రప్రాధాన్యం ఇచ్చిందని సంస్థ డైరెక్టర్ నారాయణన్ అన్నారు. భవిష్యత్తులో సమాజానికి మరింత మేలు చేకూర్చే విభాగాల్లో బ్యాచిలర్, మాస్టర్స్ పట్టభద్రులు, డాక్టరేట్లను తయారుచేయడంలో ఈ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు.

**మరింతచేయూతఇవ్వండి:కెటిఆర్**

తెలంగాణ రాష్ట్రానికి టాటా గ్రూప్‌తో ప్రత్యేక అనుబంధం ఉందని తెలంగాణ ఐటి మంత్రి కెటిఆర్ అన్నారు. కెసిఐఎస్ శంకుస్థాపన అనంతరం మాట్లాడుతూ దేశంలో టాటా గ్రూప్ అత్యధికంగా ఉద్యోగులు కలిగి ఉన్న నగరాల్లో హైదరాబాద్ రెండో స్థానంలో ఉన్నదని ఆయన తెలిపారు. గత ఆరు మాసాల కాలంలో తాను సైరస్ మిస్త్రీని కలవడం ఇది నాలుగోసారని, ప్రతీ సారి ఆయన తెలంగాణలో పెట్టుబడుల విషయంలో సానుకూలత ప్రదర్శిస్తూనే ఉన్నారని చెప్పారు. ప్రధానంగా తమది కొత్త రాష్ట్రం కావడం వల్ల తయారీ రంగంలో అగ్రగామి అయిన టాటా గ్రూప్ నుంచి మరింత సహకారాన్ని తాము ఆశిస్తున్నట్టు కెటిఆర్ చెప్పారు. తాము ఉపాధి అవకాశాలు పెంచేందుకు స్టార్‌ట్‌పలపై దృష్టి పెడుతున్నామని, ఈ విభాగంలో మరింత సహకారానికి కెసిఐఎస్ కీలక వారధిగా నిలుస్తుందని ఆయన అన్నారు.